ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.3, కనిష్ఠం 13.8
నిర్మల్
జిల్లా వార్తలు
8
ఆదివారం 7 డిసెంబరు 2025



ప్రశాంతంగా ముగిసిన డీఎడ్ పరీక్షలు

నిర్మల్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కస్బా యందు జరుగుతున్న డీఎడ్ మొదటి సంవత్సరం పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. శనివారం 87 మంది విద్యార్థులకు గాను 77 మంది విద్యార్థులు హాజరుకాగా పది మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్షలు ఈ నెల మొదటి తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. ప్రతిరోజు ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు కొనసాగాయి.

సర్పంచ్ అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు

సారంగాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు గుర్తులు కేటాయించినట్లు ఎంపీడీవో లక్ష్మీ కాంతారావు తెలిపారు.

5 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం

సారంగాపూర్ మండలంలో మొత్తం 32 గ్రామపంచాయతీలలో ఐదు గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయినట్లు ఎంపీడీవో లక్ష్మీ కాంతారావు తెలిపారు. వీటిలో రాంసింగ్ తండా, స్వర్ణ, మహావీర్ తండా, పెండలాది, సాయినగర్ గ్రామాలలో సర్పంచ్ అభ్యర్థులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దీంతో ఈ గ్రామాలలో సర్పంచ్ ఎన్నికలు లేవు.

తల్వేద సర్పంచ్ ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన లక్ష్మీ

నిర్మల్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తల్వేద గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా గుమ్మిడ్యాల లక్ష్మీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్పంచ్ అభ్యర్థిగా మొత్తంగా ఇద్దరు నామినేషన్ వేయగా ఒకరు తమ నామినేషన్ ఉపసంహరించుకున్నారు. దీంతో గుమ్మిడ్యాల లక్ష్మీ ఒక్కరే బరిలో నిలిచి ఏకగ్రీవ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు.

పరామర్శ



పరామర్శిస్తున్న నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరి రావు

నిర్మల్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రానికి చెందిన రమేష్ చావ్లా తండ్రి శుక్రవారం స్వర్గస్తులయ్యారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరిరావు భాగ్యనగర్ కాలనీలోని వారి నివాసానికి వెళ్లి రమేష్ చావ్లా కుటుంబాన్ని పరామర్శించారు. మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతున్నారు.


నిర్మల్ జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు రోజు రోజుకు ఆసక్తికరంగా మారుతున్నాయి. మూడు దశల్లో జరగనున్న ఈ ఎన్నికలను కాంగ్రెస్, బీజేపీలతో పాటు బీఆర్ఎస్ పార్టీ సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. పార్టీలకు అతీతంగా పార్టీ గుర్తులు లేకుండానే ఈ ఎన్నికలు జరుగుతున్నప్పటికీ ప్రధాన పార్టీలు మాత్రం ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగానే తీసుకుంటున్నాయి. దీంతో మండల, గ్రామస్థాయి నేతలంతా తమ పార్టీ ఇమేజ్‌ను నిలుపుకునేందుకు పోటాపోటీగా ఫిరాయింపుల పర్వానికి తెరలేపుతున్నారు. గ్రామంలోని ప్రధాన పార్టీల నేతలంతా ఎదుటి పార్టీల కార్యకర్తలను లక్ష్యంగా చేసుకుంటూ కండువాలు మార్చే ప్రక్రియను కొనసాగిస్తున్నారు.



కప్పదాట్లు.. కండువాల మార్పులు

- సర్పంచ్ ఎన్నికల్లోనూ భారీగా ఫిరాయింపుల జోరు
- పోటాపోటీగా నేతల పాట్లు
- యువజన, మహిళ, కుల సంఘాలకు గాలం

నిర్మల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : నాలుగైదు రోజుల నుంచి పార్టీ ఫిరాయింపుల పర్వం జిల్లాలో హోరెత్తుతోంది. ఖానాపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెడ్మబొజ్జు బీజేపీ, బీఆర్ ఎస్ క్యాడర్‌ను లక్ష్యంగా చేసుకొని పావులు కదుపుతున్నారు. ఇప్పటికే ఈ నియోజకవర్గంలో బీజేపీ, బీఆర్ ఎస్ పార్టీల నుంచి చేరిక పర్వం ముమ్మరమైంది. ఖానాపూర్ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జీ జాన్సన్ నాయక్ తనదైన వ్యూహంతో అధికార కాంగ్రెస్ పార్టీ, బీజేపీ కేడర్‌ను లక్ష్యంగా చేసుకుంటూ గులాబీ కండువాలు కప్పుతున్నారు. అయితే సెంటిమెంట్‌తో బీజేపీ అధ్యక్షులు రితేష్ రాథోడ్ కాంగ్రెస్, బీఆర్ఎస్ కేడర్‌ను బీజేపీలో చేర్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇలా మూడు పార్టీల నేతలు పోటాపోటీగా ఈ ఫిరాయింపుల పర్వానికి పాల్పడుతుండడంతో పంచాయతీ ఎన్నికలు రోజు రోజుకు ఉత్కంఠను రేకెత్తించబోతున్నాయి. ఎవరు ఏ పార్టీలో ఎప్పటివరకు ఉంటారోననే విషయం తెలియని పరిస్థితి నెలకొంటోంది. నిన్నటి వరకు ఓ పార్టీ కండువాను కప్పుకున్న నాయకుడు మరుసటి రోజూ మరో పార్టీ కండువాను కప్పుకుంటుండడంతో స్థానికులు వారిని ఆసక్తిగా చూస్తున్నారు. రంగులు మారుతున్నాయంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ గోడ దూకుళ్లపై సోషల్ మీడియాలో వ్యంగ్య కామెంట్లు విస్తృతంగా వైరల్ అవుతున్నాయి.



పొలిటికల్ సెంటర్‌లో ఫిరాయింపులు..

రాజకీయ కేంద్రమైన నిర్మల్ నియోజకవర్గంలో నాలుగైదు రోజుల నుంచి పోరుగా పార్టీ ఫిరాయింపుల పర్వం కొనసాగుతోంది. ముఖ్యంగా కాంగ్రెస్, బీజేపీలు పోటీ పడుతూ పార్టీ ఫిరాయింపుల పర్వాన్ని ముమ్మ రం చేస్తున్నాయి. ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్ రెడ్డి గత మూడు రోజుల నుంచి నిర్మల్‌లోనే తిష్ట వేసి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ కేడర్‌ను లక్ష్యంగా చేసుకుంటున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లోని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ కేడర్ బీజేపీలో చేరారు. వీరందరికి స్వ యంగా ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి కా షాయ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్నారు. మండల, నియోజకవర్గ స్థాయి నేతలందరికి ఎమ్మెల్యే ఈ పార్టీ ఫిరాయింపుల బాధ్యతను అప్పగించారు. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లో ఉన్న అసంతృప్త కార్యకర్తలను సెంటిమెంట్‌తో తమ వైపుకు రప్పిస్తున్నారు. రాజకీయంగా భవిష్యత్‌లో తాను అండగా ఉంటానంటూ ఎమ్మెల్యే హామీనిస్తూ భుజం తడుతున్నారు. కాగా మాజీ డీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ శ్రీహరిరావు సైతం తగ్గేదేలే అన్న చందంగా పార్టీ ఫిరాయింపులకు శ్రీకారం చుట్టారు. ముఖ్యంగా బీజేపీ కేడర్‌ను లక్ష్యంగా చేసుకుంటూ ఆయన గ్రామాల్లోని ఆ పార్టీ కార్యకర్తలను కాంగ్రెస్ పార్టీలోకి రప్పిస్తున్నారు. దీని కోసం గానూ ఆయన స్థానిక నేతలతో ప్రతిరోజూ సమీక్షిస్తూ బీజేపీ, బీఆర్ఎస్‌లోని అసంతృప్తులపై దృష్టి సారించాలని సూచిస్తున్నారు.

ముథోల్‌లో పోటాపోటీ...

మూడో దశ కింద ఎన్నికలు జరగనున్న ముథోల్ నియోజకవర్గంలో సైతం అక్కడి మూడు ప్ర.దాన పార్టీల నేతలు పోటాపోటీగా చేరికల పర్వానికి ఇప్పటి నుంచే శ్రీకారం చుడుతున్నా రు. బీజేపీకి చెందిన ఎమ్మెల్యే రామారావు ప టేల్ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ కేడర్‌ను లక్ష్యం గా చేసుకుంటూ చేరికలను అండగా నిలుస్తున్నారు. రామారావు పటేల్ హామీ మేరకు ఇప్పటికే కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు చాలా మంది బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ వ్యూహానికి ధీటుగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యేలు నారాయణ రావు పటేల్, విఠల్ రెడ్డిలు అలాగే బీఆర్ఎస్ నాయకులు కిరణ్ కొమురేవార్, రమాదేవి, విలాస్ గాదేవార్‌లు బీజేపీని లక్ష్యంగా చేసుకొని తమ తమ పార్టీల్లోకి ఆ కేడర్‌ను రప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎన్నికల విధులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

- జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్





శిక్షణ కార్యక్రమానికి హాజరైన పీవో, ఏపీవోలు, మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

మామడ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే పీవో, ఏపీవోలు తమ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ ఆదేశించారు. శనివారం మామడ మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎన్నికల విధుల్లో పాల్గొనబోయే పీవో, ఏపీవోలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ హాజరయ్యారు. శిక్షకులు అందిస్తున్న శిక్షణ సరళిని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో పీవోల పాత్ర కీలకమని తెలిపారు. మండలాల వారీగా పీవోలకు, ఏపీవోలకు ఎన్నికల విధులపై శిక్షణ ఇస్తున్నామని వివరించారు. పీవోలు బాధ్యతాయుతంగా తమ విధులు పూర్తి చేయాలన్నారు. పీవోలకు ఎన్నికల నిర్వహణపై పలు కీలక సూచనలు చేశారు. అధికారులకు సమయపాలన, క్రమశిక్షణ అత్యంత కీలకమని చెప్పారు. ఎన్నికల విధులు పారదర్శకంగా, జవాబుదారీ తనంతో, ఖచ్చితత్వంతో నిర్వర్తించాలని వివరించారు. ఎన్నికల నియమావళిని అనుసరించి అధికారులకు అప్పజెప్పిన బాధ్యతలు సక్రమంగా నిర్వహించి, ఎన్ని కలను ప్రశాంతంగా పూర్తి చేయాలన్నారు. ఎటువంటి సందేహాలు ఉన్నా పై అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. ఎన్నికల విధులపై పీవోలకు పలు ప్రశ్నలు అడిగారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలకు అధికారులు జవాబులు ఇచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్డీవో రత్న కళ్యాణి, డీపీవో శ్రీనివాస్, డీఈవో భోజన్న, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సుశీల్ పాల్గొన్నారు.

నిర్వహణలో లోటుపాట్లు కావొద్దు: కలెక్టర్

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియలో ఎటువంటి లోటుపాట్లు కలుగకూడదని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... నామినేషన్ అప్లికేషన్లకు సంబంధించి వివరాలను, మూడు దశల్లో కలిపి సర్పంచ్, వార్డు మెంబర్ స్థానాలకు దాఖలైన అధికారులను అడిగి తెలుసుకున్నారు. అవసరమైనన్ని బ్యాలెట్ పేపర్లను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీ కేంద్రాలలో పకడ్బందీ ఏర్పాటు చేయాలన్నారు. హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు సమాచారం అందివ్వడంలో తోడ్పాటు అందించాలన్నారు. ఎన్నికల కేంద్రాలకు చేరుకోవడానికి అవసరమైన వాహనాలను సిద్ధం చేసుకోవాలని పేర్కొన్నారు. కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాలని తెలిపారు.

ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌కు శుభాకాంక్షలు తెలిపిన ఏలేటి



ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కలిసిన దృశ్యం

సోన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లోకల్ వెల్మల్ గ్రామంలో ఏకగ్రీ వంగా ఎన్నికైన గ్రామ సర్పంచ్ చాత్రి గం గా ధర్, ఉప సర్పంచ్ జక్క ప్రశాంత్, వార్డు మెంబర్లు దేశెట్టి పోశెట్టి, బెల్లాల రాజేశ్వర్, జక్క పల్లవి నితీష్, చాత్రి భారతీ భీమేష్, గ ద్దంద పవన్ కుమార్, సుంకరి లక్ష్మీ చిన్న య్య, చాత్రి దివ్య గంగయ్యలు బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మె ల్యే మహేశ్వర్ రెడ్డి వారికి శుభాకాంక్షలు తె లిపారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు సరికెల గంగన్న, మండల అధ్యక్షులు మార గంగారెడ్డి, తాజా మాజీ ఎంపీపీ హరీష్ రెడ్డి తో పాటు మండల నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రచార వాహనాలకు బ్రేక్

- సర్పంచ్ ఎన్నికకు నిబంధనలు కఠినం
- తహసీల్దార్ శ్రీకాంత్



నర్సాపూర్(జి) మండల తహసీల్దార్ శ్రీకాంత్

నర్సాపూర్(జి), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాబోయే సర్పంచ్ ఎన్నికల ప్రచారానికి సంబంధించి తహసీల్దార్ శ్రీకాంత్ కఠిన నిబంధనలు అమలు చేశారు. ప్రచారానికి అభ్యర్థులు తమ గ్రామానికి చెందిన వాహనాలను మాత్రమే ఉపయోగించాలి. అలాగే ముందస్తు అనుమతి తప్పనిసరి, వాహనాల వివరాలను, లౌడ్ స్పీకర్ల వినియోగానికి సంబంధించిన దరఖాస్తులను అభ్యర్థులు తహసీల్దార్ కార్యాలయానికి ముందుగా సమర్పించి పర్మిట్ తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. పోలింగ్ రోజు నిబంధనల ప్రకారం సర్పంచ్ అభ్యర్థులు కేవలం ఒక వాహనాన్ని మాత్రమే ఉపయోగించడానికి అనుమతి ఉంటుంది. ఇతర వాహనాలు, ప్రచార వాహనాలను ఆ రోజు తిప్పడానికి అనుమతి లేదు. వార్డు సభ్యుల అభ్యర్థులకు కూడా వాహనాలు వినియోగంపై పరిమితులు విధించారు. ఈ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ శ్రీకాంత్ హెచ్చ రించారు.

పంచాయతీ ఎన్నికలకు దూరమైన సర్పంచ్ స్థానం

- బీసీ ఓటర్లే మెజారిటీ
- ఎస్సీ రిజర్వేషన్‌తో పోటీకి దూరం
- వార్డు సభ్యులకే పరిమితమైన ఎన్నికల రంగం



పెర్కపల్లె గ్రామ పంచాయతీ కార్యాలయం

దస్తురాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెర్కపల్లె గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఎన్నికలకు ఆసక్తికర పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామంలో అధిక శాతం ఓటర్లు బీసీ వర్గానికి చెందిన వారు ఉండగా, ఈసారి సర్పంచ్ పదవి ఎస్సీ రిజర్వేషన్ కిందకు రావడంతో ప్రధాన స్థానానికి పోటీ పూర్తిగా దూరమైపోయింది. గ్రామ ప్రజల్లో ఈ విషయంపై చర్చలు వినిపిస్తున్నాయి. గ్రామంలో మొత్తం 554 ఓటర్లు ఉండగా, 550 బీసీ, నలుగురు ఎస్సీ వర్గానికి చెందిన వారు ఉన్నారు. గత ఎన్నికల్లో సర్పంచ్ స్థానానికి పోటీ హోరాహోరీగా సాగినప్పటికీ ఈసారి రిజర్వేషన్ వ్యవస్థ మార్పుల కారణంగా పోటీ వాతావరణం మందగించింది. సర్పంచ్‌గా పని చేయాలనే ధ్యేయంతో సిద్ధమైన పలువురు నాయకులు రిజర్వేషన్ కారణంగా పోటీలో నిలవలేకపోతున్నారనే నిరాశ వ్యక్తం చేస్తున్నారు. గతంలో రిజర్వేషన్లపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందించిన ఫలితం లేకుండాపోయింది. దీంతో గ్రామంలో ప్రధాన హోరాహోరీ వార్డు సభ్యుల స్థానాలకే పరి మితమైంది. మొత్తం వార్డుల్లో స్థానిక గుంపుల మధ్య పోటీ ఉపందుకోగా, అభ్యర్థుల ప్రచారం దట్టంగా కొనసాగుతోంది. ప్రజలు తమ తమ వార్డుల పరిధుల్లో అభ్యర్థుల అర్హతలను పరిశీలిస్తూ ఓటు హక్కు వినియోగానికి సిద్ధమవుతున్నారు. సర్పంచ్ ఎన్నికలు లేకపోయినా, వార్డు స్థాయిలో పోటీ ఉత్సాహంగా కొనసాగుతుండటం గ్రామ రాజకీయాలను మరో మలుపులో నడిపిస్తోంది.

నర్సాపూర్(జి) బరిలో 42 మంది సర్పంచ్ అభ్యర్థులు

నర్సాపూర్(జి), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : గొల్లమాడ (7 మంది) అనూష బాయి, చెన్న రోజా రాణి, చెన్న వసంత, ధనగిరి లక్ష్మీ, కావ్య గొల్ల, నాకిడి రాజమణి, సొన్న విజయశ్రీ, భామ్ని (బి) (5 మంది) చాతాల గీత, చాతాల సరస్వతి, కందారపు సుజాత, కందారపు స్వరూప, రాథోడ్ సోనాబాయి, నర్సాపూర్(జి) (4 మంది) అజయ్ కుమార్ కట్కం, అప్పాల రాజగంగుబాయి, బర్కుంట నరేందర్, గడ్డం ఇంద్రకరణ్ రెడ్డి, రాంపూర్ (4 మంది) చిన్నోళ్ల విజయలక్ష్మి, జంగోళ్ల నవనీత, నడి పోళ్ల లావణ్య, సూరకంటి సుమతి, అంజనీ తండా (3 మంది) జాదవ్ శ్రీనివాస్, పవార్ హరిలాల్, రాథోడ్ శ్రీనివాస్, చాక్‌పల్లి (3 మంది) కోమటి లావణ్య, కూన తేజ, కూన హేమలత, తురాటి (3 మంది) బోత గౌర, సట్ల మీనా, సట్ల రాజవ్వ, అర్లీ(కె) (2 మంది) అరుణ్‌లాల్ జాదవ్, జాదవ్ కిషోర్, కుస్లీ (2మంది) నార్వాడే ప్రవీణ్ కుమార్, ఎన్. గణేష్, టెంబుర్ని (2 మంది) నిమ్మల లలిత రెడ్డి, శనిగారపు శిరీష, తిమ్మాపూర్ (2 మంది) కందెల నర్సయ్య, రాజేందర్ అల్లోర్, గొల్లమాడ గ్రామంలో అత్యధికంగా 7 మంది పోటీ పడుతుండటంతో అక్కడ పోటీ అత్యంత రసవత్తరంగా మారనుంది.

మహాలక్ష్మీ ఆలయ వార్షికోత్సవ కరపత్రాల విడుదల



మహాలక్ష్మీ ఆలయ వార్షికోత్సవ కరపత్రాలను విడుదల చేస్తున్న నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీహరి రావు

నిర్మల్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): బంగల్‌పేట్ మహాలక్ష్మి ఆలయ మూడవ వార్షికోత్సవం కరపత్రాలను శనివారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీహరి రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా మహాలక్ష్మి గుడి చైర్మన్ కె. శ్రీకాంత్ వార్షికోత్సవానికి రావాల్సిందిగా శ్రీహరి రావును, అలాగే నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్ రెడ్డిని ఆహ్వానించారు. ఈ నెల 15న సోమ వారం నిర్వహించే వార్షికోత్సవ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు రావాలని వారు కోరారు. మధ్యాహ్నం ఆలయం వద్ద మహా అన్నదానం నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బంగల్‌పేట్ యువజన సంఘం అధ్యక్షుడు పెండం శ్రీను, సంఘ సభ్యులు నరేష్ గౌడ్, కారే సుధాకర్, గాజుల రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఉపసంహరణ ప్రక్రియ పూర్తి

- 13 మంది ఔట్
- పోటీ మరింత రసవత్తరం

నర్సాపూర్(జి), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలో జరగబోయే సర్పంచ్ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ చివరి రోజు శనివారం నాటికి విజయవంతంగా ముగిసింది. ఉపసంహరణ గడువు పూర్తి కావడంతో మొత్తం 13 మంది సర్పంచ్ అభ్యర్థులు తమ నామినేషన్లను స్వచ్ఛందంగా వెనక్కి తీసుకున్నారు. దీంతో పలు గ్రామాల్లో ఎన్నికల పోటీ మరింత స్పష్టంగా రసవత్తరంగా మారింది.

ఉపసంహరించుకున్న 13 మంది అభ్యర్థుల వివరాలు

ఉపసంహరించుకున్న అభ్యర్థులు అంజనీ తండా నుంచి అంజనా బాయి, రాథోడ్ అంబాజీ, (అర్లీ(కే) నుంచి చెంద్యాల సరళ, సిందే సుమన్ బాయ్, బూరుగుపల్లి(జి) నుంచి పవార్ సురేష్, పీత్రం జాదవ్, చాక్‌పల్లి నుంచి అడ్డిగ నందిని, మ్యాదరి లక్ష్మీ, దుగ్గి బాబన్న, కుస్లీ నుంచి నార్వాడే శివాజీ రావు, నర్సాపూర్ (జి) నుంచి అరుగుమీది రామ్ రెడ్డి, తిమ్మాపూర్ నుంచి గోస్కుల భూమయ్య, టెంబుర్ని నుంచి మెంచు గంగామణి మొత్తం 13 మంది అభ్యర్థులు నామినేషన్లను ఉపసంహరించుకున్నారని ఎంపీడీవో పుష్పలత తెలిపారు.

పెంబిలో ఘనంగా అయ్యప్ప పడి పూజ



అయ్యప్ప పడి పూజలో పాల్గొన్న జాన్సన్ నాయక్

పెంబి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో అయ్యప్ప మహా పడిపూజ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన వన్నెల సూర్య ఇంటి వద్ద మహా పడి పూజ మహోత్సవం అం గరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్ పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త అంగ మల్లేష్ కుమార్తె ఇటీవల కంటి చికిత్స చేయించుకొని ఇంటికి రావడంతో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సల్ల నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు సరోజ, గాండ్ల శంకర్, మహేందర్, గోవింద్, కొట నరేందర్, తదితరులు ఉన్నారు.



గో హారతి పూజలో మంగళ హారతులతో పూజలు నిర్వహిస్తున్న మహిళలు



వేద విద్యార్థులు

బాసరలో గో హారతి పూజ

- వేద భారతి పీఠం ఆధ్వర్యంలో వైభవంగా ఆధ్యాత్మిక కార్యక్రమం

బాసర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పవిత్ర పుణ్యక్షేత్రమైన బాసర వేద భారతి పీఠం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం గో హారతి పూజను అత్యంత ఘనంగా నిర్వహించారు. గోమాత పట్ల భక్తిని చాటుతూ, ఈ విశేష పూజ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో గోవులను వివిధ రకాల హారతులతో ప్రత్యేక పూజలు సమర్పించారు. కేవలం గో హారతి పూజే కాక, భక్తుల కోసం మహాదేవుని అభిషేకం, రుద్రయాగం కూడా నిర్వహించడం జరిగింది. సుమారు రెండు గంటల పాటు జరిగిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి, మహాదేవుని ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకులు మాట్లాడుతూ ఆధ్యాత్మిక చింతనను పెంపొందించే ఈ కార్యక్రమాన్ని ప్రతి శనివారం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

(5వ పేజీ తరువాయి...)

కేసులు తప్పవని పేర్కొన్నారు. శుక్రవారం సోనాల మండల కేంద్రంలో నామినేషన్ కేంద్రాల వద్ద ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి వంద మీటర్ల లోపు చొచ్చుకొని వచ్చిన వారి పైన కేసులు వేయడం జరిగిందన్నారు. అవసరమైన విషయాలలో యువత జోక్యం చేసుకోవద్దని జోక్యం చేసుకుంటే భవిష్యత్తు నాశనం అవుతుంది అన్నారు. ఇటీవల ఓ నిరుద్యోగికి అగ్నివీర్‌లో ఉద్యోగం వచ్చిందని అయితే ఉద్యోగానికి ఎంపికైనా.. కేసులు ఉండడంతో బంగారు భవిష్యత్తు నాశనం అయ్యిందన్నారు. ప్రతీఒక్కరు భవిష్యత్తుపై దృష్టి సారించి ఉన్నతులుగా ఎదగాలని యువతకు పిలుపునిచ్చారు. ఆయన వెంట ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి స్థానిక సీఐ గురుస్వామి, ఎస్సై శ్రీసాయిలో ఉన్నారు. అంతకు ముందు కోటాకే ధన్నూర్ బోథ్, సోనాలలో కవాతు నిర్వహించారు.

ప్రజా రక్షణకు పాటు పడుతున్న హోం గార్డులు



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్ టౌన్: జిల్లా పోలీస్ సిబ్బందితో హోం గార్డులు సరిసమానంగా విధులు నిర్వహిస్తూ ప్రజా రక్షణకు పాటు పడుతున్నారని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. 63వ హోంగార్డు రైజింగ్ డే సందర్భంగా స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. హోంగార్డు భూమన్న పరేడ్ కమాండర్‌గా వ్యవహరిస్తూ మహిళా సిబ్బందితో కూడిన మూడు ప్లాటూన్‌లతో జిల్లా హోంగార్డు బృందం అద్భుతమైన పరేడ్ నిర్వహించి.. ఎస్పీకి గౌరవ వందనం చేశారు. విధులలో ఉత్తమమైన ప్రతిభ కనబరిచిన 16 మంది హోంగార్డ్‌లకు ప్రశంస పత్రాలను అందజేసి అభినందించారు. చలికాంలో ఉపయోగకరంగా ఉండే ఉలెన్ జాకెట్స్ వర్షాకాలంలో వినియోగించే రైన్ కోట్‌లను హోం గార్డులకు అందించారు. రైసింగ్ డే సందర్భంగా సిబ్బంది నిర్వహించిన అద్భుతమైన పరేడ్‌ను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సిబ్బంది ప్రతీఒక్కరు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని, విధులలో నిర్లక్ష్యం పనికిరాదని, నీతినిజాయితీలతో విధుల నిర్వహణ చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు డి.వెంకటి, టి.మురళీ, ఎల్.శ్రీకాంత్, హోంగార్డ్ ఆర్ఐ ఎస్.చంద్రశేఖర్, సబ్ ఇన్‌స్పెక్టర్లు రాకేష్, గబ్బర్ సింగ్, ఆశన్న, హోంగార్డు సిబ్బంది సురేందర్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్ విజయవంతానికి కృషి చేయాలి: న్యాయాధికారి

బోథ్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): డిసెంబరు 21న నిర్వహించిన నేషనల్ లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని కుంభ సందీప్ పేర్కొన్నారు. శనివారం ఏర్పాటన సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టాల అమలు ప్రజల హక్కులు న్యాయ ప్రక్రియ పైన ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు మోహన్‌రావు, సుభాష్, హరీష్, కుమ్మరి విజయ్, పోలీసు, అటవీ శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి



నాటికలు ప్రదర్శిస్తున్న బాలికలు



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

మహిళల్లో ఆత్మవిశ్వాసం పెరగాలి

● ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎలాంటి విపత్కర పరిస్థితులనైనా ధైర్యంగా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసం మహిళల్లో పెరగాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మహిళలపై హింసకు వ్యతిరేకంగా నవంబరు 25 నుంచి డిసెంబరు 10 వరకు జరుగుతున్న అంతర్జాతీయ ప్రచారోద్యమం నేపథ్యంలో సఖి కేంద్రం, జిల్లా మహిళా, శిశు, వికలాంగుల, వృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని న్యూ అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా బాలికలు వివిధ హోదాల్లో మహిళలు నిర్వర్తించే బాధ్యతలను ప్రతిబింబించే ప్రదర్శనలు చేయడం ఆకట్టుకుంది. కొలాం ఆశ్రమోన్నత బాలికల పాఠశాల విద్యార్థినులు బాల్యం నుంచి వృద్ధాప్యం వరకు మహిళలు ఎదుర్కొనే సవాళ్లు, వాటిని అధిగమించే ధైర్యాన్ని నాటిక రూపంలో ప్రదర్శించి ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ సలోని, డీడబ్ల్యూవో మిల్కా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్నాల నాగేశ్, సీడబ్ల్యూసీ ఛైర్మన్ వెంకటస్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలపై హింస నిర్మూలన కోసం సమాజమంతా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. కుటుంబం నుంచి కార్యాలయం వరకు ప్రతిస్థాయిలో మహిళలకు సురక్షిత వాతావరణం కల్పించడం ప్రభుత్వంతో పాటు సమాజ పౌరుల బాధ్యత అని పేర్కొన్నారు. అవగాహన కార్యక్రమాలు కేవలం రూపచిత్రాలుగా కాకుండా, ప్రతి ఒక్కరి ఆలోచనల్లో మార్పు తీసుకువచ్చే దిశగా సాగాలన్నారు. మహిళలు చైతన్యవంతులై తమ హక్కులపై అవగాహన పెంచుకున్నప్పుడే నిజమైన సామాజిక మార్పు సాధ్యమన్నారు.



మేడిగూడ గ్రామంలో నివాళులర్పిస్తున్న మాజీ వైస్ ఎంపీపీ, నాయకులు



తలమడుగులో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



తాంసిలో నివాళ్లర్పిస్తున్న దళిత సంఘాలు, వివిధ పార్టీల నాయకులు

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

(5వ పేజీ తరువాయి....)

స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త బీఆర్ఎస్ నాయకులు కొమ్ము విజయ్,దావుల రమేష్, ముంజంసోము, వీరయ్య, రంజనాబాయిలతో పాటు వివిధ పార్టీల నాయకులు ప్రజాసంఘాల నాయకులు, ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

దళిత, బహుజన వర్గాల ఆశాజ్యోతి

నేరడిగొండ: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న, దళిత బహుజన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలో ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ ఛైర్మన్ రవీందర్ రెడ్డి, మాదిగ కుల సంఘం అధ్యక్షుడు గాజుల శ్రీకాంత్, మాల సంఘం అధ్యక్షుడు నక్క మహేందర్, అడెల్లు, గాజుల గంగయ్య, గాజుల సతీష్, సాబ్లే సంతోష్, శంకర్, సంజీవ్, పండరి, నారాయణస్వామి, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలో అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో శనివారం వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. అయితే ఎన్నికల బరిలో దిగిన వారంతా దళిత సామాజిక వర్గానికి చెందిన మహిళలు కావడంతో వారంతా హాజరై అంబేద్కర్‌కు ఘన నివాళులు అర్పించారు.

నార్నూర్: బలహీన వర్గాల ఆశాజ్యోతి, రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అని గాదిగూడ మాజీ వైస్ ఎంపీపీ యోగేష్, సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ కార్యదర్శి బి.గజానంద్ నాయక్, మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు చంద్రశేఖర్ లోకండే అన్నారు. శనివారం ఉమ్మడి మండలంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కేశవ్ రావు లోకండే, విజయ చాలుర్కర్, సర్పంచ్ అభ్యర్థులు బానోత్ కావేరి, ఆడె జయశ్రీ, బానోత్ ప్రణీత, పాక్స్ ఇన్‌చార్జి ఛైర్మన్ సురేష్ ఆడె, కేశవ్ దుర్గే, హన్మంతు కొలెట్కర్, గున్వంత్‌రావు దుర్గే, మహిళలు పాల్గొన్నారు.

తలమడుగు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరు నడుచుకోవాలని అంబేద్కర్ సంఘం అధ్యక్షులు దేవన్న కోరారు. శనివారం మండల కేంద్రంలో అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించారు.

తాంసి: భారతరత్న డాక్టర్ బీఆర్.అంబేద్కర్ 69వ వర్ధంతిని శనివారం తాంసి మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రమైన తాంసితో పాటు జామిడి, కప్పర్ల, పొన్నారి, బండల నాగపూర్ గ్రామాలలో ఈ జయంతి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటంతో ఊరేగింపు నిర్వహించారు.

లెక్క.. చెప్పాల్సిందే!

(5వ పేజీ తరువాయి...)

సర్పంచ్ అభ్యర్థులు 9 మంది.. మరో 226 మంది వార్డు మెంబర్లపై అనర్హత వేటు పడింది. నిబంధనల ప్రకారం 45 రోజుల లోపు ఎన్నికల ఖర్చుల లెక్కలను చూపాల్సి ఉంది. కానీనిర్లక్ష్యం కారణంగా ఎన్నికల సంఘం వేటు వేసినట్లు అధికారులు తెలిపారు. స్థానిక అధికారులు సకాలంలో అభ్యర్థులను అప్రమత్తం చేయక పోవడంతో ఇలాంటి పరిస్థితికి కారణమంటున్నారు. ఏడాది దాటినా.. లెక్కలు చూపక పోవడంతో 2020 డిసెంబరులో సర్పంచ్, వార్డు మెంబర్లపై ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. గతంలో అనర్హత వేటు పడిన వారంతా ప్రస్తుతం పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు. ఎందుకంటే మూడేళ్లు గడిచిపోవడంతో అధికారులు మళ్లీ అర్హులుగా గుర్తిస్తున్నారు.

విచ్చలవిడిగా ఎన్నికల ఖర్చు

పంచాయతీ ఎన్నికల్లో నిబంధనల ప్రకారమే అభ్యర్థులు ప్రచారం, ఇతర అవసరాలకు సంబంధించిన ఖర్చులు చేయాల్సి ఉంటుందని ఎన్నికల సంఘం పేర్కొంటుంది. కానీ కొంత మంది అభ్యర్థులు గెలిచేందుకు విచ్చలవిడిగా అనాధికారికంగా ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తుంది. మేజర్ గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థుల ఖర్చు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షలు, చిన్న గ్రామ పంచాయతీల్లో రూ.10 లక్షల వరకు ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. కొన్ని చోట్లనైతే వార్డు మెంబర్ ఖర్చే రూ.5 లక్షలకు పైగా ఉంటుందని తెలుస్తుంది. క్షేత్రస్థాయిలో ఎన్నికల అధికారులు నిఘా సారించక పోవడంతో ఎన్నికల ఖర్చుకు అడ్డూఅదుపు లేకుండా పోతోందంటున్నారు. ఎన్నికల్లో డబ్బు, మద్యంతో ఓటర్లను మభ్యపెడుతూ తమవైపునకు తిప్పుకుంటున్నారు.

ఏఐసీసీ ఇన్‌చార్జి నుంచి బోరంచుకు పిలుపు



మీనాక్షి నటరాజన్‌ను కలిసిన బోరంచు

మావల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ పిలుపు మేరకు తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా ఆమెను శనివారం కలిశారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయాలు, అభివృద్ధిపై పలు అంశాలపై చర్చించారు. అనంతరం మీనాక్షి నటరాజన్ మాట్లాడుతూ పార్టీని నమ్ముకున్న వారికి సమూచిత స్థానం కల్పిస్తామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని మీనాక్షి నటరాజన్ ఈ సందర్భంగా సూచించారు.

'అగ్నివీర్'అనిల్ యువతకు ఆదర్శం

ఉట్నూర్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని హస్నాపూర్‌కు చెందిన యువకుడు రాథోడ్ అనిల్ యువతకు ఆదర్శం అని గ్రామస్థులు పేర్కొంటున్నారు. దేశ రక్షణ దళాల్లో భాగమైన అగ్నివీర్ ఎంపికలో అర్హత సాధించి, కఠినమన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి శనివారం హస్నాపూర్‌కు చేరుకున్న గ్రామ యువకుడు రాథోడ్ అనిల్‌ను వివేకానంద యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. యూత్ సభ్యులు మాట్లాడుతూ రాథోడ్ అనిల్ సాధించిన ఈ విజయం గ్రామ యువతకు ఆదర్శం అన్నారు. అగ్నివీర్ శిక్షణను పూర్తి చేసి గ్రామానికి తిరిగి రావడం సంతోషంగా ఉందన్నారు. గ్రామంలోని యువతకు క్రీడలు, ఉద్యోగ అవకాశాలు, సేవా కార్యక్రమాల్లో ప్రోత్సాహం అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు యూత్ సభ్యులు తెలిపారు.

ఈత పోటీల్లో ప్రతిభ కనబరచాలి

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా ఆదిత్య ఖండేష్కర్ నియమితులయ్యారు. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్షా ప్రధాన కార్యదర్శులు సాయిని రవికుమార్, కొమ్ము కృష్ణ ఆయనను శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా తనకు అవకాశం ఇవ్వడం పట్ల ఆదిత్య ఖండేష్కర్ హర్షం వ్యక్తం చేశారు. జిల్లాలో స్విమ్మింగ్ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు అసోసియేషన్ ఆధ్వర్యంలో విస్తృత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల ఏడవ తేదీ నుంచి స్థానిక ఒక్లే ఇంటర్నేషనల్ స్కూల్ లో జరగనున్న స్విమ్మింగ్ పోటీల్లో ఆసక్తి కలిగిన వారు పాల్గొని ప్రతిభ కనబరచాలన్నారు. జిల్లాలో స్విమ్మింగ్ క్రీడాభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తామని పేర్కొన్నారు.

కమనీయం.. మల్లికార్జున స్వామి కల్యాణం



కల్యాణం జరుపుతున్న వేద పండితులు

నర్సాపూర్(జి), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి సమీపంలో ఉన్న దేవుని చెరువు వద్ద మల్లికార్జున స్వామి కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. కల్యాణానికి ముందు వేద పండితులు పాల్దే నరహరి ఇంటి వద్ద ఉన్న స్వామివారి విగ్రహ మూర్తులు, నగలను పల్లకిలో ఉంచి, బాజాభజంత్రీలతో గ్రామస్థులు అత్యంత భక్తి శ్రద్ధలతో ఆలయానికి తీసుకువచ్చారు. వేద పండితులు గోపాల్ జ్యోషి, రతన్‌ల మంత్రోచ్చారణల మధ్య జరిగిన ఈ కళ్యాణాన్ని మండల కేంద్రానికి చెందిన ఏలేటి కిష్టారెడ్డి దంపతులు, కాత్రే బాలాజీ దంపతులు భక్తి శ్రద్ధలతో జరిపించారు. ఈ కార్యక్రమానికి చుట్టుపక్కల మూడు మండలాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కళ్యాణం అనంతరం భక్తులందరికీ అన్నదానం చేశారు.

నేడు భారీ జాతరపై దృష్టి

ఈ కల్యాణ ఉత్సవాల సందర్భంగా నేడు (ఆదివారం) స్వామివారి భారీ జాతర జరగనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామ వీడీసీ సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా త్రాగు నీరు, వసతి వంటి అన్ని రకాల సౌకర్యాలను కల్పించారు. శాంతిభద్రతల దృష్ట్యా ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

విపరీత ఖర్చులతో అప్పుల పాలు కావొద్దు

▸▸ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న రితేష్ రాథోడ్

ఖానాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం జరుగుతున్న పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో నిలిచిన వారంతా విపరీత ఖర్చులు చేసి అప్పుల పాలు కావద్దని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ పిలుపునిచ్చారు. శనివారం ఖానాపూర్‌లో నిర్వహించిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థులు ఎన్నికల కోసం అదనపు ఖర్చులు చేయొద్దన్నారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇస్తు న్న నిధుల వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం చేయాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ చేస్తు న్న అభివృద్ధిని ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆకుల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్ల రవీందర్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, జిల్లా కార్యదర్శి మదిరే శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు కీర్తి మనోజ్, మండల అధ్యక్షుడు పుప్పాల ఉపేందర్, రమేష్, అనిల్ రావు, ఎనగందుల నారాయణ, అజయ్, సందీప్, తదితరులున్నారు.

నేడు నారాయణ సంస్మరణ సభ

నిర్మల్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీఎన్జీవో భవన్‌లో ఆదివారం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో నారాయణ (పీఆర్‌టీయూ వ్యవస్థాపకుడు) సంస్మరణ సభ నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు ఆరేపల్లి విజయ కుమార్, ప్రధాన కార్యదర్శి జి. ధర్మారావు తెలిపారు.

నామినేషన్ల ఉపసంహరణకు రాయబే(భా)రాలు

భైంసా, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పంచాయతీ ఎన్నికల చివరి విడత నామినేషన్ల ప్రక్రియ పూర్త వడంతో బరిలో నిలిచిన అభ్యర్థులు ప్రత్యర్థులను రంగం నుంచి ఉపసంహరించేందుకు గాను చర్యలు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లోని అనుచరగణంతో నామినేషన్ వేసిన ఇతరుల ఉపసంహరణకు గాను రాయ బే(బా)రాలు ముమ్మరం చేశారు. శుక్రవారం రాత్రి నామినేషన్లు ముగియడంతో శనివారం నుంచి నామినేషన్ల ఉపసంహరణ కోసం బుజ్జగింపుల పర్వం మొదలయింది. నజరానాలు, ప్రలోభాలతో మచ్చిక చేసుకొని ఉపసంహరణ ప్రక్రియ నిర్వహించే దిశగా చర్యలు వేగవంతమయ్యాయి. సర్పంచ్ స్థానం మొదలుకొని వార్డు సభ్యుల వరకు ఏకగ్రీవం చేసేందుకు ప్రధాన పార్టీల నాయకులు ప్రయత్నాలను ముమ్మరం చేశారు. ఒకే పార్టీ నుంచి ఇద్దరు, ముగ్గురు సర్పంచ్ అభ్యర్థులుగా బరిలో ఉన్న పంచాయతీల్లో ఆయా పార్టీల మండల స్థాయి, నియోజకవర్గ స్థాయి నాయకులు రంగంలోకి దిగారు. తీవ్ర పోటీ నెలకొని ఉన్న పంచాయతీల్లో గెలుపు కోసం వ్యూహ ప్రతీ వ్యూహాలతో కదళికలను ముమ్మరం చేశారు. శనివారం మూడవ విడత ఎన్నికలు జరిగే భైంసా డివిజన్ పరిధిలోని అధిక శాతం పంచాయతీల్లో నామినేషన్ల ఉపసంహరణ కోసం గాను సమావేశాలు, బుజ్జగింపులు, రాయబారాలు, రాయబేరాలు జోరుగా కొనసాగాయి.

● భైంసా డివిజన్‌లో..

మూడవ విడత పంచాయతీ ఎన్నికలు కొనసాగే భైంసా డివిజన్ పరిధిలోని ఐదు మండలాల పరిధిలో 133 సర్పంచ్ స్థానాలకు గాను 714 నామినేషన్లు 1,126 వార్డు స్థానాలకు గాను 2,268 నామినేషన్లు దాఖలయ్యాయి. ఇందులో భైంసా మండల పరిధిలో 30 స ర్పంచ్ స్థానాలకు 170 మంది, 258 వార్డు స్థానాలకు 541 మంది, కుబీర్ మండల పరిధిలోని 42 పంచాయతీల సర్పంచ్ స్థానాలకు 214 మంది, 344 వార్డు స్థానాలకు 692 మంది, ముథోల్ మండల పరిధిలోని 19 పంచాయతీ సర్పంచ్ స్థానాలకు 97 మంది, 166 వార్డు స్థానాలకు 340 మంది, తానూర్ మండల పరిధిలోని 32 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలకు 160 మంది, 268 వార్డు స్థానాలకు 508 మంది, బాసర మండల పరిధిలోని 10 పంచాయతీ స ర్పంచ్ స్థానాలకు 73 మంది, 90 వార్డు స్థానాలకు 187 నామినేషన్లు దాఖలయ్యాయి. డివిజన్ పరిధిలోని అధిక గ్రామ పంచా యతీల్లో సర్పంచ్ స్థానాలకు తీవ్ర పోటీ నెలకొని ఉంది.

● తీవ్రమైన పోటీ

భైంసా డివిజన్ పరిధిలో పంచాయతీ ఎన్నికలలో ఏకగ్రీవం జరిగే పంచాయతీలు నామమాత్రంగానే ఉన్నాయి. ఈ క్రమంలో అంతటా తీవ్రమైన పోటీ వాతావరణం నెలకొంది. సర్పంచ్ స్థానాలతో పాటు వార్డు స్థానాలకు హోరాహోరిగా పోరు కొనసాగే పరిస్థితులు నెలకొన్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీతో పాటు బీజేపీ, బీఆర్ఎస్ మద్దతుతో బరిలోకి దిగిన అభ్యర్థులు అస్త్ర, శస్త్రలతో ఎన్నికల సంగ్రామానికి సిద్ధమయ్యారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండడంతో ఒకే పార్టీకి చెందిన మద్దతు దారులు ఇద్దరు, ముగ్గురు బరిలో ఉంటే వారితో సంబంధిత పార్టీ ప్రతినిధులు సంప్రదింపులు, చర్చలు ముమ్మరం చేశారు. వచ్చే ఎ న్నికల్లో సర్పంచ్ లేదా రానున్న ఎంపీటీసీ ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామని హామీలను ఇస్తూ వారి నామి నేషన్ ఉపసంహరింప జేసేందుకు చర్యలను ముమ్మరం చేశారు.

నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు



తరోడాలో వివరాలు అడిగి తెలుసుకుంటున్న రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు



అధికారులతో వివరాలు అడిగి తెలుసుకుంటూ..

ముథోల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తరోడాలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రాన్ని శనివారం రాష్ట్ర ఎన్నికల పరిశీలకులు ఆయేషా మస్రత్ ఖానం ఆకస్మిక తనిఖీ చేశారు. శనివారం రోజున నామినేషన్ల పరిశీలన ప్రక్రియ కొనసాగడంతో ఈ సందర్భంగా క్లస్టర్‌లోని ఆర్వో, ఏఆర్వోలకు సంబంధిత వివరాలను అడిగి తెలుసుకున్నారు. వెనువెంటనే ఆన్‌లైన్‌లో సంబంధిత నామినేషన్ దారుల పేర్లను పొం దు పరిచారా ఎలా జరుగుతున్నాయనే విషయంపై అడిగి తెలుసుకున్నారు. ప్రతీది క్షుణ్ణంగా పరిశీలించారు. వీరి వెంట ఎంపీడీవో లవకుమార్, ఎంపీవో శివ కుమార్, సూపరిండెంట్ అశోక్‌తో పాటు ఎన్నికల సిబ్బంది, తదితరులున్నారు.

నామినేషన్‌లు పరిశీలించిన రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్

తానూర్: రాష్ట్ర ఎన్నికల అబ్జర్వర్ ఆయేషా మస్రత్‌ఖాన్ శనివారం తానూర్ మండలంలోని బేల్ తరోడా క్లస్టర్‌ను సందర్శించారు. మూడో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ శుక్రవారం సాయంత్రంతో ముగియగా అబ్జర్వర్ ఈ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులతో మాట్లాడిన ఆమె ఎన్నికల ప్రక్రియ సజావుగా పారదర్శకంగా జరిగేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ల ఘట్టంలో అన్ని రకాల భద్రతా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు అబ్జర్వర్‌కు వివరించారు. పరిశీలకుల వెంట ఎంపీడీవో శ్రీధర్, ఎంపీవో అమీర్‌ఖాన్, అధికారులు, ఎన్నికల సిబ్బంది ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో కొనసాగిన కైలాస్‌టేకిడి జాతర



మండలిపూజ కార్యక్రమంలో పాల్గొన్న లింబాజి మహారాజ్

బోథ్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న కైలాస్ టేకిడి పర్వతంపై శనవారం జాతర ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వందలాది మంది భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి శివలింగాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా లింబాజి మహరాజ్ భక్తులకు ఆశీర్వచనం అందించారు. అంతేకాక మండలి పూజ కార్యక్రమం కొనసాగింది. తెలంగాణ మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో అటవి ప్రాంతమంతా భక్తులతో నిండిపోయింది. శివ నామస్మరణతో అడవి మార్మోగింది.



ఏకగ్రీవమైన సర్పంచ్ అభ్యర్థిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

రెండు గ్రామ పంచాయతీలు బీజేపీ కైవసం

లోకేశ్వరం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): లోకేశ్వరం మండలంలోని నరసింహ నగర్ తండా, సేవాలాల్ తం డా గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రెండు గ్రామ పంచాయతీలలో సర్పంచ్ అభ్యర్థిత్వాలకు, వార్డు అభ్యర్థిత్వాలకు ఒక్కటి చొప్పున నామినేషన్‌లు రావడంతో రెండు గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం కావడంతో బీజేపీ నాయకులు ఎమ్మెల్యే పవార్ రామారావు నివాసానికి చేరుకుని సంబరాలు జరుపుకున్నారు. నరసింహ నగర్ తండా సర్పంచ్‌గా జాదవ్ పార్వతి రాజేష్ బాబు, ఉప సర్పంచ్‌గా ఆడే బలిరామ్, సేవాలాల్ తండా సర్పంచ్‌గా రాథోడ్ సాయినాథ్, ఆడే సందీప్‌లు ఎన్నికయ్యారు. ఎమ్మెల్యే రామారావు చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై తాము ఈ నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు. ప్రధాని నరేంద్ర మోదీ గిరిజన అభివృద్ధికి పాటు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పటేల్ మాట్లాడుతూ సర్పంచ్ ఎన్నికలు ఏకగ్రీవం కావడం సంతోషకరమన్నారు. రెండు గ్రామ పంచాయతీలకు సీడీఎఫ్ కింద చెరో రూ.5 లక్షలు నిధులిస్తా మని ప్రకటించారు. బీజేపీ సర్పంచ్ ఏకగ్రీవమైన చోట గ్రామ అభివృద్ధికి 5 లక్షల రూపాయల నిధులు ఇవ్వనట్లు చెప్పారు.

ముగిసిన నామినేషన్ల పరిశీలన ప్రక్రియ


ముథోల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 5 క్లస్టర్లలో 19 గ్రామ పంచాయతీలకు గాను సం బంధించిన నామినేషన్లను శనివారం సంబంధిత అధికారులు పరిశీలించారు. అయితే మండలంలోని 19 గ్రా మ పంచాయతీలకు గాను సర్పంచ్‌లకు 77 నామినేషన్లు రాగా 166 వార్డులకు గాను 332 నామినేషన్లు వచ్చినట్లు ఎంపీడీవో లవకుమార్ తెలిపారు. ఇదిలా ఉండగా మండలంలోని విట్టోలి తండా గ్రామ పంచా యతీలో సర్పంచ్‌కు ఒక నామినేషన్ అలాగే ఎడ్‌బిడ్ తండా గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఒక నామినేషన్ వచ్చినట్లు ఎంపీడీవో లవకుమార్ తెలిపారు. మండలంలోని ఎడ్‌బిడ్ తండా, విట్టోలి తండా జీపీలలో సర్పంచ్‌కు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఈ రెండు జీపీలలో సర్పంచ్‌లు ఏకగ్రీవం కానున్నాయి.

కాంగ్రెస్‌లో చేరిక

పెంబి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ మైనార్టీ మండల అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్ శని వారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సల్ల స్వప్నిల్ రెడ్డి ఆధ్వర్యంలో పెంబిలో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పనులను చూసి పార్టీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సల్ల స్వప్నిల్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పుప్పాల శంకర్, తులాల శంకర్, స్వామి, దేవేందర్ రెడ్డి, మహేందర్, అర్జున్న, చారి, నాను, భూమేష్, ముఖేందర్ ఖాన్, తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్



మహిళలే.. మహారాణులు

»» రిజర్వేషన్ రావడంతో పల్లె పోరుకు రెడీ

బోథ్,డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):బోథ్ గ్రామ పంచాయతీలో 16వార్డులు ఉండగా అందులో ఎనిమిది వార్డులు మహిళలకు రిజర్వేషన్ కావడంతో వారు ఈ సారి పల్లె పోరుకు సిద్ధమవుతున్నారు. అంతేకాక సర్పంచ్ స్థానం సైతం ఎస్సీ మహిళలకు కేటాయించడంతో ఆయా వర్గాలకు చెందిన మహిళలు తమ నామినేసన్లు దాఖలు చేస్తున్నారు. గురువారం అన్నిగ్రామాలలో మహిళ రిజర్వేషన్లు ఉన్న చోట నామినేషన్లు వేసేందుకు తరలివచ్చారు. ఎన్నడు బయట కనిపించని మహిళలు ఎన్నికల పుణ్యమా అని గ్రామ పంచాయతీకి వచ్చి నామినేషన్లు వేసి వెళ్తున్నారు. గెలిస్తే మహిళలు మహారాణులు అవుతారని పరిశీలకులు అంటున్నారు.



బోథ్ గ్రామపంచాయతీలో నామినేషన్ వేసేందుకు వచ్చిన మహిళలు

పల్లెపోరు.. మైకుల జోరు

ఉట్నూర్,డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి)గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు మైకులు జోరుగా పెట్టి పల్లెలను హోరెత్తిస్తున్నారు.మండల కేంద్రంలోని మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ బరిలో ఉన్న అభ్యర్థులు పోటాపోటీగా వాహనాలు ఏర్పాటు చేసుకుని మైకులు పెట్టి హోరెత్తిస్తున్నారు. మండలంలోని దంతన్‌పల్లి, బీర్సాయిపేట, దొంగచింత, చెరువుగూడెం, గోండుగూడా, ఘన్పూర్, లక్కారం, లింగోజీతండా, శ్యాంపూర్, నాగపూర్, సాలెవాడ బి తదితర 31 గ్రామ పంచాయతీలలో సర్పంచ్ అభ్యర్థులు ఎన్నికల ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. ఆయా గ్రామాలలో ఉన్న వార్డు మెంబర్లు సతం ప్రింటింగ్ ప్రెస్‌లకు వెళ్లి తమ గుర్తులతో ఉన్న మాదిరి బ్యాలెట్ పేపర్లను తయారు చేసుకుని ప్రజలకు పంచుతున్నారు.

నాలుగు సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):ఆదిలాబాద్ రూరల్ మండలంలో జరిగే రెండో విడత ఎన్నికల్లో 31 గ్రామ పంచాయతీలకు గాను నాలుగు గ్రామ పంచాయతీలు, ఏకగ్రీవం అయ్యారు. ఇందులో కూడా నాలుగో గ్రామపంచాయతీలో సర్పంచ్ స్థానంతో పాటు వార్డుమెంబర్లతో సహా పూర్తి బాడీ అందరూ ఏకగ్రీవం అవడం విశేషం. అల్లి కోరి, యశోద, పెద్ద మాలే బోరిగం గ్రామ పంచాయతీలు వార్డుమెంబరులు సర్పంచ్‌లు పూర్తిగా ఏకగ్రీవమైనట్లు తెలుస్తుంది. బోర్నూర్ చెంచుదరి చెంచుఘాట్ గ్రామాల్లోని వార్డు మెంబర్‌లు అందరూ ఏకగ్రీవం అవ్వగా సర్పంచ్ స్థానాలు మాత్రం పోటీలో ఉన్నట్లు తెలుస్తోంది.

బీఎల్‌వోల మాయాజాలం

»» భార్యకు ఓ చోట భర్తకు మరోచోట ఓటు హక్కు

బోథ్,డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):గత నెల రోజుల క్రితం మండలంలోని ప్రభుత్వకార్యాలయాల్లో బీఎల్‌ఓలతో ఓటరు జాబితాను సవరించారు. వారి మాయాజాలం వల్ల జాబితాను సరైన రీతిలో తయారు చేయక పోవడం వల్ల ఓటరు జాబితాలు తప్పుల తడుగా మారాయి. చనిపోయిన వాళ్లను తొలగించక పోగా వేరే గ్రామంలో నివాసముంటున్న వారికి సైతం గ్రామాలలో ఓటు హక్కును కల్పించి ఉన్నారు. పట్టణాలలో వారికి మునిసిపాలిటీలో ఓటు హక్కు ఉన్న గ్రామాలలో సైతం ఓటరు జాబితాలో వారి పేర్లు ఉన్నాయి. దీం తో ఓటరు జాబితాల పై సవరణ సరిగా చేయలేదన్న విమర్శలు వస్తున్నాయి. నెలల కొద్ది ఈ కార్యక్రమాన్ని చేపట్టిన అంతా తప్పుల తడకగా మారింది. కొన్ని వార్డులలో భార్యకు ఓటు హక్కు ఉంటే భర్తకు మరో వార్డులో ఓటు హక్కు కల్పించారు. కుటుంబమంతా బీఎల్‌వోలా నిర్వాకం వల్ల చెల్లా చెదుర అయ్యాయి. ఏది ఏమనా అన్ని గ్రామాలలో ఓట రు జాబితా చెల్లా చెదురుగా

దేశానికి అంబేద్కర్ చేసిన సేవ ఎనలేనిది

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



భైంసాలో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే విఠల్ రెడ్డి తదితరులు



కుంటాల మండలం వెంకూర్ గ్రామంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జిల్లా ఉపాధ్యక్షుడు మగ్గిడి దిగంబర్, గ్రామస్థులు



ట్రిపుల్‌ఐటీలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఖానాపూర్/భైంసా/కుంటాల/బాసర/భైంసారూరల్/లక్ష్మణచాంద, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్ భారత దేశానికి చేసిన సేవ ఎనలేనిదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్ సహా పలువురు వక్తలు అన్నారు. శనివారం ఆయన వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో నిర్వహించిన వేర్వేరు కార్యక్రమాలలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఘనంగా నివాళులర్పించారు. స్థానిక అంబేద్కర్ చౌక్‌లో నిర్వహిం చిన కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్, బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్‌లు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. భైంసా డివిజన్ పరిధిలో శనివారం భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బీఆర్ అంబేడ్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని భైంసా బస్టాండ్ ఎదుట గల బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, దళిత సంఘాలు, ఉద్యోగ, యువజన, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

కుంటాల మండలంలోని వెంకూర్ గ్రామంతో పాటు ఆయా గ్రామాలలో శనివారం రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మగ్గిడి దిగంబర్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపూర్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకై కృషి చేయాలి : వీసీ గోవర్ధన్

బాసరలో ట్రిపుల్ ఐటీలో భారత రాజ్యాంగ రూపశిల్పి, గొప్ప సంఘసంస్కర్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధనకై ప్రతీ ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఆర్జీయూకేటీలో బాసర ఉపకులపతి ప్రొఫెసర్ గోవర్ధన్ పిలుపునిచ్చారు. శనివారం బాసర ట్రిపుల్‌ఐటీలో బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని ఆర్జీయూకేటీలో ఎస్సీ ఎస్టీ సెల్ ఆధ్వర్యంలో మహా పరినిర్వాణ దివసం శ్రద్ధాశక్తులతో ఘనంగా నిర్వహించారు. ఈ ఓఎస్‌డి మురళీదర్శన్, ఎస్సీ, ఎస్టీ సెల్ అధ్యక్షుడు డాక్టర్ రేవల్లి అజయ్‌కుమార్, తదితరులున్నారు. భైంసారూరల్ మండలంలోని తిమ్మాపూర్‌లో శని వారం భారత రాజ్యాంగ నిర్మాత, మహా నేత డాక్టర్ భీమ్‌రావు రాంజీ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాన్ని అంబేద్కర్ యువజన సంఘం గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యం లో నిర్వహించారు. గ్రామ ప్రజలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో దళిత - బహుజన నాయకులు చాకేటి లస్మన్న మాట్లాడు తూ.. ఈకార్యక్రమంలో నాయకులు డాక్టర్ లక్ష్మణ్‌తో పాటు అనంతుల సంతోష్, దేవన్న, శ్రీనివాస్, రామా రావు,దుబాయ్ శీను,గోపి, శైలేష్,మహేందర్,నవీన్, పాల్గొన్నారు, డాక్టర్ బీఆర్. అంబేద్కర్ వర్ధంతిని మండలంలోని మునిపెల్లిలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నూతికాడి రాజారెడ్డి, మేడిపెల్లి నరహరి, షేరు రాజారెడ్డి, నాయకులు శనిగారపు నారాయణ, మేదరి భూమేష్, గ్రామ యువకులు పాల్గొన్నారు.





అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం - మునిపెల్లిలో అంబేద్కర్ వర్ధంతిని నిర్వహిస్తున్న దృశ్యం

క్రైం సమాచారం

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

● నర్సాపూర్(జి) సమీపంలో ఘటన ● నిర్మల్ ఆస్పత్రికి తరలింపు

నర్సాపూర్(జి),డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):నర్సాపూర్(జి)మండల కేంద్రానికి చెందిన ఒక కుటుంబం ప్రయాణిస్తుండగా మార్గ మధ్యలో జరిగిన సం ఘటనలో సుమారు 48 సంవత్సరాల వయస్సు గల కండెల లక్ష్మీ తీవ్రంగా గాయపడ్డారు. నర్సాపూర్(జి)కి చెందిన కండెల రాములు తన భార్య లక్ష్మీ (48),మనమరాళ్లు మనీష్, అక్షరలతో కలిసి నిర్మల్ నుంచి నర్సాపూర్(జి) వైపు టీవీఎస్ మోపడ్ పై వస్తున్నారు. ఈక్రమంలో వారు రాంపూర్ పెట్రోల్ పంపు దగ్గరకు చేరుకోగానే లక్ష్మీకిఒక్కసారిగా కళ్లుతిరిగి రోడ్డుపై పడిపోయాయి. ఈ ఘటనలో లక్ష్మీకి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది ఈఎంటీ ఆనంద్, పైలెట్ రణవీర్ ఆమెకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం లక్ష్మీని నిర్మల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.ఆమె ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.



లక్ష్మీని అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

విద్యుదాఘాతంతో గేదె మృతి

నిర్మల్‌రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి):మండలంలోని ముజ్గి గ్రామంలో శనివారం గంప సాయన్న అనే రైతు గేదె విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.80వేల ఉంటుందని రైతు వాపోయాడు. గ్రామంలోని గజ్జల మల్లయ్య తోట లో ప్రమాదవశాత్తు గేదె గడ్డి మేస్తూ వెళ్లి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి మృతిచెందిందని రైతు తెలిపారు. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు కోరాడు.



గేదె కళేబరం

పురుగుల మందు తాగి ఒకరి మృతి

లక్ష్మణచాంద,డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మం డలంలోని ధర్మారం గ్రామానికి చెందిన వేముల నాగరాజు (36)పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు వివరా ల్లోకి వెళ్తే వేముల నాగరాజు ట్రాక్టర్ బ్లేడ్ బండి నడుపుతూ జీవనం కొనసా గిస్తుండేవాడు. గత కొన్ని రోజుల నుంచి బ్లేడ్ బండి సరిగ్గా నడవకపోవడంతో కుటుంబ పోషణ, ఆర్థిక సమస్యలతో బాధపడుతుండేవాడు. శుక్రవారం ఉదయం పనికి వెళ్తానని వెళ్లి ధర్మారం గ్రామ శివారులో మల్లాపూర్ వెళ్లే దారిలో ఏదో గుర్తు తెలియని పురుగుల మందు తాగి ఇంటికి వచ్చాడు. వాంతులు చేయగా వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిర్మల్‌లోని దేవేందర్ రెడ్డి ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని యశోద ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం వేముల నాగరాజు చనిపోయాడు. మృతుడికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. మృతుడి భార్య వేముల అనూష ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు లక్ష్మణచాంద ఎస్సై జి. శ్రీనివాస్ తెలిపారు.



నాగరాజు (ఫైల్)

దేశ సేవలో ధన్నూర్-డి యువకుడు

»» ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం



ఆర్మీ జవాన్‌కు స్వాగతం పలుకుతున్న ధనూర్-డి గ్రామస్థులు

నేరడిగొండ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఇండియన్ ఆర్మీలో చేరి, తన శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకుని తొలిసారిగా స్వగ్రామానికి వచ్చిన ఆర్మీ జవాన్ సాబ్లే శ్రావణ్‌కు మండలంలోని ధన్నూర్-డి గ్రామస్థులు ఘనస్వాగతం పలికారు. గ్రామానికి చేరుకున్న జవాన్ శ్రావణ్‌ను గ్రామస్థులు, యువకులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. దేశ రక్షణ బాధ్యతలో తమ గ్రామ యువకుడు పాలుపంచు కోవడం తమకు ఎంతో గర్వకారణమని, దేశ సేవలో పాల్గొనే భాగ్యం తమ గ్రామానికి దక్కడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా గ్రామస్థులు ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో తిత్రే అమర్ సింగ్, కృష్ణ, సాబ్లే అమర్ సింగ్, ధరంసింగ్, రోహిదాస్, అనిల్, అర్జున్, వినీల్ మరియు గ్రామపెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి అమ్ముతున్న ముగ్గురిపై కేసు

ఆదిలాబాద్‌టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖానాపూర్ వద్ద గల గంజాయి అమ్మడంతోపాటు సేవిస్తున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పట్టణానికి చెందిన అర్మాన్, సయ్యద్ బిలాల్, అనిమేశ్ గంజాయి తాగుతూ, అమ్ముతున్న సమయంలో ఎస్సై అశోక్ వారిని పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి 15 గ్రాముల ఎండు గంజాయి, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కోరిన కోరికలు తీర్చే కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి

»» బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ »» బరంపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహించిన ఎమ్మెల్యే

తలమడుగు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భక్తులు కోరిన కోరికలు తీర్చే కలియుగ దైవం వేంకటేశ్వర స్వామి అని బోథ్ ఎమ్మెల్యే అనిల్ యాదవ్ అన్నారు. శనివారం అదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలోని తెలంగాణ తిరుపతిగా అభివృద్ధి చెందుతున్న బరంపూర్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బరంపూర్ కొండపై స్వయంభుగా వెలసిన వేంకటేశ్వర స్వామి నమ్ముకున్న వారికి నమ్ముకున్నంతగా కోరికలు తీర్చే కోనేటి రాయుడుగా భక్తులు పూజిస్తారు.. ఇందులో మాజీ మంత్రి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఆలయ కమిటీ అధ్యక్షుడు ముడుపు కేదారేశ్వరరెడ్డి, సామాజిక కార్యకర్త ముడుపు మౌనిష్ రెడ్డి, మాజీ డిసిపి చైర్మన్ దామోదర్‌రెడ్డి, అధికార ప్రతినిధి కిరణ్, రఘు, తుల శ్రీనివాస్, అబ్దుల్లా అభిరాంరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, మగ్గిడి ప్రకాష్, రామ్, కిషన్, కేమ శ్రీకాంత్, చంటి బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు భక్తులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



అన్నదానంలో ఎమ్మెల్యేఅనిల్ జాదవ్, జోగు రామన్న



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ యాదవ్

సమన్వయంతో ఎన్నికల విధులు

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : అధికారులు సమన్వయం చేసుకొని ఎన్నికలు సమర్థవంతంగా ప్రశాంత వాతారణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శనివారం జడ్పీ సమావేశ మందిరంలో మూడు విడతల గ్రామ పంచాయితీ ఎన్నికల సూక్ష్మ పరిశీలకుడు, జోనల్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతీ ఒక్క ఎన్నికల సూక్ష్మ పరిశీలకులకు ఒక గ్రామ పంచాయతీ కేటాయించడం జరుగుతుందని, ఆ గ్రామపంచాయతీ పరిధిలోని అన్ని వార్డులకు సంబంధించి పరిశీలన చేయవలసి ఉంటుందని తెలిపారు. ప్రతి ఒక్క మైక్రో అబ్జర్వర్ 28 కాలం ప్రొఫార్మాను విధిగా నింపాలని, పోల్ డే రోజు ఎప్పటికప్పుడు వివరాలు తెలియజేయాలన్నారు. ఎలక్షన్ నిర్వహణను పూర్తి అవగాహన చేసుకుని జరిగే ప్రతి అంశాన్ని నమోదు చేసి ఎన్నికల సాధారణ పరిశీలకులకు పంపించవలసి ఉంటుందని సూచించారు. పోలింగ్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుంచి ఎన్నిక ప్రక్రియ పూర్తయి రిసెప్షన్ సెంటర్‌కు వెళ్లేంతవరకు విధులు నిర్వహించవలసి ఉంటుందని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది తప్పనిసరిగా పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలని అన్నారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకోవడానికి రోడ్ల మరమ్మతులను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్ర మంలో ఎన్నికల సాధరణ పరిశీలకులు టి.వెంకన్న, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, జిల్లా శిక్షణ నోడల్ అధికారి మనోహర్, డీపీఓ రమేష్, డిఎల్పీఓ ఫణీందర్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, అధికారులు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

కాంగ్రెస్,బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోకండి

తలమడుగు/ఇచ్చోడ/నెరడిగొండ,డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): పదవుల కోసం కాంగ్రెస్ బీజేపీ నాయకులు చెప్పే మాయమాటలకు ఎవరు నమ్మి మోసపోవద్దని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ కోరారు. శనివారం మండలంలోని కుచలాపూర్ గ్రామానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు పతని అశోక్ కొంతమంది గ్రామస్థులు యువజన సంఘాల సభ్యులు అధికార పార్టీకీ రాజీనామా చేసి బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. అనంతరం పతాని అశోక్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన ప్రయోజనం కనిపించలేదన్నారు. ఇందులో మండల కన్వీనర్ తోట వెంకటేష్ అధికార ప్రతినిధి కిరణ్ జనార్ధన్ తోట శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



బీఆర్ఎస్‌లో ఆహ్వానిస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఘటన స్థలాన్ని సందర్శించి క్షతగాత్రులను అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఇచ్చోడ మండల కేంద్రంలోని స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ 11వ వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని కోరుతూ బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు శనివారం ఎమ్మెల్యే నివాసంలో అయ్యప్ప స్వాములు ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో గురు స్వాములు, ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

ఈశ్వరాచారికి ఘన నివాళి

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని తెలంగాణ తల్లి చౌక్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సాయి ఈశ్వరాచారికి ఘన నివాళులు అర్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్‌లు బీసీలకు కల్పిస్తామని బూటకపు హామీ ఇచ్చి నెరవేర్చలేదని, ఇందుకు మనస్తాపం చెంది తన ప్రాణాలను బలిదానం చేయడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని మాజీమంత్రి జోగురామన్న అన్నారు. కొవ్వొత్తులతో ర్యాలీ ప్రదర్శనను నిర్వహించి ఆయన చిత్రపటం వద్ద పూలతో శ్రద్ధాంజలి ఘటించారు.



నివాళులర్పిస్తున్న నేతలు

సాయి ఈశ్వర చారి కుటుంబానికి అండగా నిలవాలి

సాయి ఈశ్వరచారి ఆత్మహత్య కాంగ్రెస్ ప్రభుత్వ హత్యనే అని, బీసీలను ప్రభుత్వం మోసం చేసిందని ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఆరోపించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలు

మావల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి):సమీపంలోని దేవాపూర్ ఎక్స్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదం జరిగిన ఘటన చోటు చేసుకుంది. మావల సీఐ స్వామి తెలిపిన వివరాలు ప్రకారం గుడిహత్నూర్ నుంచి ఆదిలాబాద్ వైపు వస్తున్నా మహారాష్ట్రకి చెందిన బస్ బస్సు డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న ఆటో ట్రాలీ, ఆర్టీసీ బస్సు ఒక దానికొకటి బలంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో బస్సు ముందు భాగం స్వల్పంగా దగ్ధమై, అద్దాలు పగిలాయి. ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా అందులోని ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ఆటో ట్రాలీ డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

భారీ శివలింగానికి భక్తుల పూజలు

- చెన్నై నుంచి బిహార్‌కు తరలింపు
- ఇచ్చోడలో భక్తుల దర్శనార్థం ఆగిన 106 టైర్ల భారీ వాహనం



ఇచ్చోడలో ఆగిన శివలింగాన్ని తరలిస్తున్న భారీ వాహనం

ఇచ్చోడ, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బిహార్‌లోని తూర్పు చంపారణ్ వద్ద నిర్మిస్తున్న రామాయణ్ మహావీర్ ఆలయంలో ప్రతిష్ఠించడానికి తీసుకెళ్తున్న భారీ సహస్ర శివలింగానికి శనివారం ఇచ్చోడలో భక్తులు పూజలు చేశారు. గతనెల 22న చెన్నై నుంచి తరలిస్తుండగా ఇచ్చోడ జాతీయ రహదారిపై వాహనం కొద్దిసేపు ఆగింది. మహాబలిపురానికి సమీపంలోని వట్టినాడ్‌లో దీనిని తయారు చేశారని పేర్కొన్నారు. దాదాపు 200 టన్నులకు పైగా ఉన్న మహా శివలింగం చుట్టూ 1008 చిన్నచిన్న శివలింగాలు చెక్కి ఉన్నట్లు తరలించే సభ్యులు తెలిపారు. భారీ లింగాన్ని 106 చక్రాల భారీ లారీలో 12 మంది సభ్యులు కలిసి తీసుకెళ్తున్నారు. సహస్ర శివలింగాన్ని దర్శించుకునేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్దఎత్తున దర్శించుకుని పరవశించిపోయారు. భారీ ఏకశిలా శివలింగాన్ని దర్శించుకోవడం అదృష్టమని పలువురు భక్తులు పేర్కొనడం గమనార్హం.

పెరుగుతున్న చలి తీవ్రత

- అర్లి(టి)లో అత్యల్పంగా 9.4 డిగ్రీల ఉష్ణోగ్రత
- చలిమంటలతో వెచ్చదనం పొందుతున్న జనం

ఆదిలాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గత నాలుగైదు రోజులుగా జిల్లాలో చలి తీవ్రత మరింతగా పెరుగుతోంది. ఉదయం, పగలు అనే తేడా లేకుండా చలిప్రభావం కనిపిస్తుంది. శనివారం జిల్లా గరిష్ఠ సగటు ఉష్ణోగ్రత 27.8 కాగా కనిష్ఠంగా 10.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అత్యల్పంగా భీంపూర్ మండలం అర్లి(టి)లో 9.4, సాత్నాలలో 9.7, బోథ్‌లో 9.9, ఆదిలాబాద్‌రూరల్ 10.0, సోనాలో 10.1, తాంసిలో 10.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం, రాత్రి వేళల్లో చలిమంటలతో వెచ్చదనం పొందుతున్నారు. వెచ్చని దుస్తులు ధరించి బయటకు వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. చలి తీవ్రతకు పిల్లలు, వృద్ధులు అస్వస్థతకు గురవుతున్నారు. మరికొన్నాళ్ల పాటు అప్రమత్తంగా ఉండాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.



జిల్లాకేంద్రంలో చలి మంటలు కాగుతున్న ప్రజలు



దట్టమైన పొగమంచులో వాహనదారుల రాకపోకలు ఇలా..



మాట్లాడుతున్న అడిషనల్ పీసీసీఎఫ్ రత్నాకర్ జోహారి

టూరిజం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి


ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అటవీ సంపదతో పాటు టూరిజం అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అడిషనల్ పీసీసీఎఫ్ రత్నాకర్ జోహారి అన్నారు. శనివారం అటవీ ప్రాంతాలను పరిశీలించేందుకు జిల్లాలో పర్యటించిన ఆయన... అటవీ శాఖ గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎఫ్ఓ ప్రశాంత్ బాజీరావుతో కలిసి పాల్గొన్నారు. కవ్వాల్ టైగర్ ఫారెస్ట్ పరిధిలో టైగర్ ఏర్పాటుకు పలు గ్రామాలను గుర్తించినట్లు ఈ సందర్భంగా ఆయన తెలిపారు. పులుల సంరక్షణతో సహా... ఎకో టూరిజం పెంచేలా కృషి చేస్తామన్నారు. అదే విధంగా అటవీ ప్రాంతంలో లక్కను ప్రోత్సహిస్తు స్థానికులు ఆదాయం పొందేలా కృషి చేస్తున్నామన్నారు. అటవీ సరిహద్దుల రక్షణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని వివరించారు. బాసర జోనల్‌లోని కవ్వాల్ టైగర్ అభివృద్ధికి ఇన్‌చార్జిగా తాను బాధ్యతలు నిర్వర్తిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా అటవీ ప్రాంతంలో పులుల రాకపోకలు సాగుతున్న నేపథ్యంలో వాటి రక్షణకు సైతం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి స్వల్ప గాయాలు

గంజాయి అమ్ముతున్న ముగ్గురిపై కేసు

వివరాలు 7వ పేజీలో.....

లెక్క చెప్పాల్సిందే!




గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులం తా ఖర్చు లెక్కలు చెప్పాల్సిందేనంటూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. దీననుగుణంగానే జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. సర్పంచ్, వార్డు మెంబర్ పదవులకు నామినేషన్ దాఖలు చేస్తున్న వారందరికీ అధికారులు విధిగా ఎన్నికల నియామవళిని అందజేస్తున్నారు. ఎన్నికల ఖర్చు వివరాలు, విధి విధానాలపై రిటర్నింగ్ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అడ్డగోలుగా ఖర్చు చేసి 45 రోజుల్లోపు లెక్కలు చూపకుంటే వేటు తప్పదంటున్నారు. వేటు పడిన అభ్యర్థులు మూడేళ్ల పాటు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉండదంటున్నారు. అభ్యర్థులు ఎన్నికల ఖర్చు పై అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచిస్తున్నారు.

- సర్పంచ్, వార్డు మెంబర్ అభ్యర్థులకు ప్రత్యేక బ్యాంకు అకౌంట్లు
- గెలిచినా.. ఓడినా.. ఖర్చు లెక్కలు చూపడం తప్పని సరి
- 2019 ఎన్నికల్లో 235 మందిపై అనర్హత వేటు
- అడ్డగోలుగా ఖర్చు చేస్తున్న అభ్యర్థులపై నిఘా కరువు
- నామినేషన్ రశీదుతో అభ్యర్థుల చేతికి ఎన్నికల నియమావళి
- జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికల సందడి

ఆదేశాలు జారీ చేసిన ఎన్నికల సంఘం





ఆదిలాబాద్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 473 గ్రామ పంచాయతీలు, 3870 వార్డుమెంబర్ స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే తొలి విడత ఎన్నికలకు సంబంధించిన గుర్తులను కేటాయించడంతో అభ్యర్థులు ఎన్నికల ప్రచారంతో దూసుకు పోతున్నారు. నామినేషన్ రోజే బలాన్ని చూపుకునేందుకు అభ్యర్థులు భారీగా ఖర్చు చేస్తున్నా.. అధికారులు మాత్రం దృష్టి సారించడం లేదంటున్నారు. శనివారం రెండవ విడత నామినేషన్ల విత్‌డ్రా పూర్తయ్యింది. దీంతో అభ్యర్థులకు గుర్తులను కేటాయించారు. మూడవ విడత నామినేషన్ల ప్రక్రియ పూర్తయితే పంచాయతీ ఎన్నికల ప్రచారం మరింతగా ఊపందుకోనుంది.

నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

పంచాయతీ ఎన్నికల్లో ఓడినా.. గెలిచినా.. ఖర్చు లెక్కలు చూపాల్సి ఉంటుంది. నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు తప్పవని ఎన్నికల అధికారులు హెచ్చరిస్తున్నారు. పోటీ చేసిన అభ్యర్థులు నిబంధనల ప్రకారమే ఖర్చు చేయాల్సి ఉంటుంది. నామినేషన్ వేసే సమయంలోనే జీరో బ్యాలెన్స్‌తో ఉన్న బ్యాంక్ అకౌంట్ వివరాలను ఎన్నికల అధికారులకు అందించాలి. అలాగే దేనికి ఎంత ఖర్చు చేయాలనే విషయాన్ని కూడా ఎన్నికల సంఘం నియమావళిలో స్పష్టంగా సూచించింది. దీని ప్రకారమే ఖర్చు వివరాలు నమోదు చేయాలి. మేజర్ గ్రామ పంచాయతీల్లో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులు గరిష్ఠం గా రూ.2.50 లక్షలు, వార్డు మెంబర్లు రూ.50 వేలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. చిన్నస్థాయి గ్రామ పంచాయతీల్లో పోటీ చేసే సర్పంచ్ అభ్యర్థులు రూ.లక్షా 50 వేలు, వార్డు మెంబర్ అభ్యర్థులు రూ.30 వేలు ఖర్చు చేయాలని నియమావళి పేర్కొంటుంది. అంతేకాకుండా అభ్యర్థులు చేసే ఖర్చులపై ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తారు.

గతంలో 235 మందిపై వేటు

2019 పంచాయతీ ఎన్నికల్లో పలువురు సర్పంచ్‌లు వార్డు మెంబర్లపై ఈసీ అనర్హత వేటు వేసింది. జిల్లాలో 235 మందిపై వేటు పడగా.. ఇందులో

(తరువాయి 6వ పేజీలో....)

శాంతి భద్రతలకు విఘాతం కల్గిస్తే కఠిన చర్యలు : ఎస్పీ

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని.. శాంతిభద్రతలకు విఘాతం కల్పించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో వర్గాలను రెచ్చగొట్టేలా పోస్టులు పెట్టిన వారిపై, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. సోషల్ మీడియాపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. జిల్లా అంతటా 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని, సభలు సమావేశాలు ర్యాలీలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని తెలిపారు.

యువతకు ఉద్యోగాల హామీ నెరవేర్చేదెన్నడు? : బీఆర్ఎస్

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీజేపీ నేతలంతా కాంగ్రెస్ ప్రభుత్వం పై విమర్శలు చేస్తుంటే.. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాత్రం ముఖ్యమంత్రిని ఎందుకు పొగుడుతున్నారని, బీజేపీ పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న చర్చనే తాను లేవనెత్తానని మాజీమంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు జోగురామన్న అన్నారు. స్థానిక బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను ఖండించారు. హైదరాబాద్ లో ప్రత్యేకంగా కార్యాలయం ప్రారంభించి ఢిల్లీలో పైరవీలు చేస్తున్న విషయాన్ని ఆ పార్టీ అగ్రనేత బీ.ఎల్ సంతోష్ శ్రేణులతో చర్చించారని, ఆ బీజేపీ ఎమ్మెల్యే ఎవరన్న విషయం సదరు పార్టీ నేతలందరికీ తెలుసన్నారు. తన వ్యక్తిత్వం గురించి ఆదిలాబాద్ ప్రజలందరికీ తెలుసనీ, ఎటువంటి అవినీతి, అక్రమాలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరి సంక్షేమం కోసమే పని చేశానని తెలిపారు. ప్రస్తుత ఎమ్మెల్యే వ్యాపారులతో భూములు కొనిపించడంతో ప్రస్తుతం వారు ఇబ్బందులు పడుతున్నారని, పరిశ్రమలు స్థాపించి యువతకు ఉద్యోగాలు ఇప్పిస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. సీసీఐను కేంద్రమే పునఃప్రారంభిస్తుందని గతంలో కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమార స్వామి స్పష్టమైన హామీ ఇచ్చారని, ప్రస్తుతం పరిశ్రమను ప్రైవేట్ పరం చేసేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలోను స్వంత పార్టీ కౌన్సిలర్లు, స్థానిక నేతలను ఎమ్మెల్యే నయవంచనకు గురి చేశారని ఆరోపించారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ముమ్మర ఏర్పాట్లు

- జడ్పీలో ఎన్నికల అధికారులకు మండలాల అలాట్‌మెంట్
- పర్యవేక్షించిన కలెక్టర్ రాజర్షి షా
- సిబ్బందికి పలు సూచనలు

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణపై అధికార యంత్రాంగం ముమ్మర ఏర్పాట్లు చేపడుతోంది. మూడు దశల్లో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో సంబంధిత అధికారులకు జిల్లా ఉన్నతాధికారులు విస్తృత సూచనలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే శనివారం జడ్పీ సమావేశ మందిరంలో రెండవ విడత గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రిసైడింగ్ అధికారులకు మండలాల అలాట్‌మెంట్‌కు సంబంధించి రెండవ విడత ర్యాండమైజేషన్ నిర్వహించారు. కలెక్టర్ రాజర్షి షా ఈ ప్రక్రియను పర్యవేక్షించి అధికారులు, సిబ్బందికి అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎన్నికల సాధరణ పరిశీలకులు టి. వెంకన్న, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, శిక్షణ కలెక్టర్ సలోని చబ్రా, జిల్లా శిక్షణ నోడల్ అధికారి మనోహర్, డీపీవో రమేష్, డీఎల్పీవో ఫణీందర్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



వివరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

చివరి దశ ఎన్నికలు ముగిసే వరకు కోడ్ అమల్లోనే..

ఆదిలాబాద్ టౌన్: జిల్లాలో గ్రామ పంచాయతీ ఎన్నికలు మూడు దశల్లో జరుగుతుండడంతో, చివరి దశ ఎన్నికలు పూర్తయ్యే వరకు జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉంటుందని కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. ఎన్నికలు పూర్తిగా ముగిసే వరకు ఎంసీసీ కొనసాగుతుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికైన సభ్యులకు ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలని, విజయోత్సవ ర్యాలీలు, పబ్లిక్ మీటింగులు, ప్రకటనలు, అభివృద్ధి హామీలు వంటి చర్యలను తక్షణమే నిరోధించాలని సంబంధిత రిటర్నింగ్ ఆఫీసర్లకు కలెక్టర్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. అంతేకాకుండా ఎన్నికల సమయంలో పార్టీ ర్యాలీలు, కార్యక్రమాలు, అభివృద్ధి ప్రకటనలు స్పష్టమైన ఎంసీసీ ఉల్లంఘనేనని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లాలో శాంతియుత, పారదర్శక ఎన్నికల నిర్వహణకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించినట్లు గమనించిన వెంటనే సంబంధిత ఎన్నికల అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు పేర్కొన్నారు.

పారదర్శకంగా ఎన్నికల ప్రక్రియ

ఆదిలాబాద్ టౌన్: అభ్యర్థుల ఉపసంహరణ, ప్రచురణ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. రెండవ, మూడవ విడత మండలాల గ్రామపంచాయతీ ఎన్నికల స్టేజ్-1 అధికారులకు, సిబ్బందికి శనివారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆయన గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండవ విడత మండలాల గ్రామపంచాయితీ ఎన్నికల్లో శనివారం అభ్యర్థుల ఉపసంహరణకు చివరి రోజు అయినందున పోటీ చేసే అభ్యర్థుల జాబితా ప్రచురణ నేపథ్యంలో తగు జాగ్రత్తలు వహించాలని స్టేజ్-1 రిటర్నింగ్ అధికారులకు సూచించారు. అదేవిధంగా మూడవ విడత పంచాయితీ ఎన్నికల స్క్రూట్నీ ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని, ఏమైనా సందేహాలు ఉంటే రిటర్నింగ్ అధికారికి అందించిన సమాచార పుస్తకం ద్వారా మాస్టర్ ట్రైనర్, అధికారులకు తెలిపి నివృత్తి చేసుకోవాలని అన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, డీపీవో రమేష్, డీఎల్పీవో ఫణీందర్, మాస్టర్ ట్రైనర్ లక్ష్మణ్, రిటర్నింగ్ అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్‌లు, ఎంపీవోలు, అధికారులు పాల్గొన్నారు.



సోనాల గ్రామంలో మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- ఇబ్బందులు కలిగిస్తే కేసులు తప్పవు : ఎస్పీ అఖిల్ మహాజన్

బోథ్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎస్పీ అఖిల్ మహాజన్ పేర్కొన్నారు. శనివారం సోనాల, బోథ్ మండలాలలో పర్యటించారు. ఈ సందర్భంగా సోనాల, బోథ్ గ్రామాలలో ఏర్పాటైన కార్యక్రమాల్లో మాట్లాడారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. అయితే ప్రభుత్వ ఉద్యోగులకు పోలీసుల విధులకు ఆటంకం కలిగించినట్లయితే

(మిగితా 6వ పేజీలో....)

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

- ఎంపీ గోడం నగేష్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్
- అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి
- పాల్గొన్న కలెక్టర్, జిల్లా అధికారులు, ప్రజా సంఘాలు, యువజన సంఘాల ప్రతినిధులు, నాయకులు



ఆదిలాబాద్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్, నేతలు

ఆదిలాబాద్ టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గొప్ప ఆలోచనతో అందరికీ సమాన హక్కులు కల్పిస్తూ రూపొందించిన భారత రాజ్యాంగం ప్రపంచ దేశాలకే ఆదర్శప్రాయమని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. భారతరత్న, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళ్లర్పించారు. అంబేద్కర్ దేశానికి అందించిన విశేషమైన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వివిధ దళిత, ప్రజా సంఘాల ప్రతినిధులు సైతం పాల్గొన్నారు. అనంతరం బౌద్ధ వందనం గావించి పంచశీల జెండాను ఆవిష్కరించారు. అదేవిధంగా సమతా సైనిక్ దళ్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న శిబిరం గోడ ప్రతులను విడుదల చేశారు. ఈమేరకు ఎంపీ నగేష్, ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ దేశ రాజ్యాంగం ఎంతో గొప్పదని, అన్ని మతాలు, కులాలు, అన్నివర్గాలకు దిశా నిర్దేశం చేస్తూ రూపొందించబడిందన్నారు. అందరికీ సమాన హక్కులు ఉండాలనే ఆలోచనా దృక్పథంతో దేశానికి రాజ్యాంగాన్ని అందించారన్నారు. రాజ్యాంగాన్ని ఒక గొప్ప గ్రంథంగా పరిగణిస్తూ ప్రతిఒక్కరూ తమ నిత్య జీవితంలో రాజ్యాంగానికి కట్టుబడి నడుచుకోవాలని సూచించారు. రాజ్యాంగ సూత్రాలను అనుసరించి ముందుకుసాగాలని దిశా నిర్దేశం చేశారు. ప్రపంచ దేశాల్లో ఏ దేశానికి లేనివిధంగా గొప్ప రాజ్యాంగాన్ని అందించిన మహానుభావుడు బీఆర్ అంబేద్కర్ అని, భౌతికంగా ఆయన మన మధ్యలేనప్పటికీ ఆశయాలకు అనుగుణంగా ముందుకు కదలాల్సిన అవసరం ఉందన్నారు.



నేరడిగొండలో నివాళ్లర్పిస్తున్న యువజన సంఘ సభ్యులు, ప్రజాప్రతినిధులు

ప్రజాస్వామ్యానికి పునాదులు వేసిన మహనీయుడు

ఆదిలాబాద్ టౌన్: భారత రాజ్యాంగ నిర్మాత, మహనీయ నేత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా కలెక్టర్ రాజర్షి షా ఘనంగా నివాళులర్పించారు. శనివారం ఎస్సీ సంక్షేమ శాఖ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో అంబేద్కర్ చిత్ర పటానికి, విగ్రహానికి అధికారులు, సిబ్బందితో కలిసి కలెక్టర్ పూలమాలలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సామాజిక న్యాయం, సమానత్వం, ప్రజాస్వామ్యానికి శాశ్వత పునాదులు వేసిన మహనీయుడు అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లే బాధ్యత అందరిపైనా ఉందని అన్నారు. భారత రాజ్యాంగ రూపకల్పనలో ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని, ఇండియన్ కాన్స్టిట్యూషన్ డ్రాఫ్ట్ కమిటీ ఛైర్మన్‌గా, వివిధ ఉన్నత పదవుల్లో ఉన్నప్పుడు దేశ నిర్మాణానికి క్రాంతిదాయక మార్గదర్శకాలు చూపించారన్నారు. ఆర్టికల్ 14 ద్వారా సమానత్వ హక్కు, స్వేచ్ఛ, న్యాయం అందరికీ చేరేలా చేసిన అంబేద్కర్ సేవలు అపారమని పేర్కొన్నారు. ఇందులో అదనపు కలెక్టర్‌లు శ్యామలాదేవి, రాజేశ్వర్, ఎస్సీ సంక్షేమ అధికారి సునీత, ఈడీ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

ఉట్నూర్: మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌరస్తాలో ఉన్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఆయన వర్ధంతి కార్యక్రమాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ దళిత, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో ఘన నివాళులర్పిస్తూ ఆయన జాతి కోసం చేసిన సేవలను

(మిగితా 6వ పేజీలో....)